# బస్సు ప్రయాణం

శ్రీమతి పులిపాక బాలాత్రిపురసుందరమ్మగారు

రైళ్లున్నా, బళ్లున్నా, ఎన్ని సౌకర్యాలున్నా, ఏమున్నా అందరూ బస్సుమీదనే ప్రయాణం చేయడానికి సిద్ధపడుతూ వుంటారు. అదే సుఖమనుకుంటారు. ఆలాగే అనుకున్నారు సత్యవతిగారుకూడా. ప్రయాణమూ చేశారు. అయితే వారికి బస్సంటే గుండె ఝల్లుమంటుంది. కారణమేమో వారే చెపుతారు చూడండి.

నేను వంటఇంట్లో వంటచేస్తూ అన్నపూర్ణ అష్టకాలు పారాయణ చేసుకుంటూండగా ఉత్తరం వచ్చిందని మా శకుంతల తీసికొచ్చింది. అది చూచి మా రాదాయి 'అమ్మా బంగాలు ఉత్తలమే నాకిప్పించవే' అని ఏడుస్తూ ఎగిరి లాక్కుంటున్నాడు. ఇంతలో పసివాడుపోయి అడగటంచేతగాక చేయి జాచి ఏడుస్తున్నాడు. ఈ దృశ్యమంతా చూచేసరికి నాకు పట్టరాని నవ్వు కోపము వచ్చాయి. 'ఏమిటే శకుంతలా ఇల్లాపడెయ్యి ఆక్కార్డు' అన్నాను. 'ఏదో పెండ్లి శుభలేఖలా ఉందమ్మా' అంటూ విసరి నామీద పడేసింది శకుంతల. అదిమా మేనకూతురి పెండ్లి శుభలేఖ!

మా పంతులుగారు ఊళ్లోలేరు. ఎల్లాగా? వస్తారో రారో ఈలోపల. పెండ్లికి వెళ్లాలి తప్పని ప్రయాణం. నాకు సరదాగావుంది వెళ్లాలని. అదిగాక మా మేనత్త అంటే మాకు ప్రేమ, మేమంటే మా మేనత్తకు ప్రేమ. అల్లాంటప్పుడు యెవరికైతేమటుకు వెళ్లాలని ఉండదు?

పంతులుగారు ఆవేళ మధ్యాహ్నమే వచ్చారు. వెంబడి ఇద్దరు స్నేహితులు. సాయంకాలంవరకు వారితో మాట్లాడుతూనే వున్నారు.

రాత్రి భోజనాలు ముగిశాయి. స్నేహితులు వెళ్లిపోయారు. వంటఇంట అన్నిసర్ది పిల్లన్ని పడుకోబెట్టి చిన్నబ్బాయిని తీసుకునివెళ్లాను. పంతులుగారేదో చూచుకుంటున్నారు పండుకొని.

'ఏమండీ శుభలేఖవచ్చింది' అన్నా నెమ్మదిగా.

'ఎక్కడినుంచీ?'

'బెల్లంపూడినుంచి.'

'ఏం శుభలేఖ?'

'మా మేనత్తకూతురి పెండ్లని శుభలేఖ వచ్చింది.'

'నిరుడు అయింది కాబోలు?'

'మీ మాటలన్నీ ఇల్లాంటి హాస్యాలే. నిరుడైతే ఆ పిల్లదేనా? ఇప్పుడు యింకో పిల్లది.'

'అయితే యేమంటావు?'

'ఏమిలేదు.'

'ఏమిలేకపోతే యెందుకు చెప్పావు?'

'ఉత్తరం వచ్చిందిగనుక చెప్పాను.

'అయితే నీకు వెళ్లాలని ఉన్నదా?'

'నాకు వెళ్లాలని ఉండటమేమిటి? మీరుమటుకు రారూ?'

'నేను మళ్లీ సర్క్యూటు వెళ్లాలి. కొవ్వూరు దగ్గర వంతెన కడుతున్నారు. ఓవరసీయిరు, యింజనీయరు

గుమస్తాలు అందరు అక్కడే ఉన్నారు. పిల్లలను చూచి వెళ్లుదామని వచ్చాను. నీ మాటలను బట్టిచూస్తే నీకు వెళ్లవలెనని ఉన్నట్టుంది. నీవు వెళ్లు, నా అభ్యంతరం లేదు. పిల్లలుమటుకు జాగ్రత్తసుమా! ఇనప్పెట్టెలో బాలరు సంచీలో పైకం ఉంది. నీకు కావలసినది తీసుకుని తలుపు తాళంవేసి ఇల్లు వెంకాయికి వొప్పచెప్పి వెళ్లు'.

సరే ఇదీ మంచిదే అనుకుని 'సరే' అన్నాను. తెల్లవారింది. ఏడుగంటల బండికి వెళ్లారు మా పంతులగారు. తరువాత నేనూ ప్రయాణం సిద్ధంచేసుకొని రెండుగంటల బస్సుకు వెళ్లాను.

౨

రంయిన శబ్దంచేస్తూ దూకుపెడుతూ వెళుతున్నది బస్సు. రోడ్డున కనిపించే చెట్లను, బెదిరి చీకాకుగా పరుగులెత్తే పశువులను బస్సు పరుగుకు తప్పుకోలేక పొదలలోకీడ్చే రెండెడ్ల బండ్లనూ, చూస్తూ చంకలో నుంచి కేరింతలుకొడుతూ ఆడుకుంటున్నాడు మోహనుడు.

'అమ్మా ఊరు యెప్పుడు వస్తుందే? సుబ్బుల ఒదినెతో గోపాలం బావతో యెప్పుడు ఆడుకుంటానే?' అని బస్సు వేగంకంటె మా రాధాయి మనోవేగం ఎక్కువగా ఉన్నది. పెళ్లికి వెళ్లుతున్నాను గదా మా వాళ్లంతా వస్తారు చూస్తారు అని నాకు సంతోషంగానే ఉన్నది. గాని పెద్దదానిగనుక సంతోషాన్ని వెలిబుచ్చక నా ప్రక్కనున్న ముసలివితంతువు నడిగాను, 'ఈ బస్సు ఎన్నిగంటలకు బిల్లంపూడి వెళ్లుతుంది?' అని. అయిదు గంటలకు అని ఆవిడ చెప్పింది. మేమంతా ఇల్లా అనుకుంటూ చూస్తూ ఉండగానే యేదో టప్పుమన్న శబ్దంవినపడ్డది. ఎందుకు ఆగింది గదా అని చూస్తూన్నాం మేం. ఇంతలో ఒక యువకుడు రెండువ్రేళ్ల సందునా సిగరెట్టు ఇరికించుకుని పొగ పీలుస్తూవచ్చి యేమండోయి దిగండి అన్నాడు.

ఏదో చెడ్డదికాబోలు దిగితే బాగుచేస్తారనుకున్నాను నేను. ఊరు వచ్చింది దిగుతున్నామనుకున్నారు పిల్లలు. ఏదికాదు ఇంజనులో యేదో చెడ్డదట అది తణుకువెళ్లి కొనుక్కుని రావాలట. ఇక రేపు ప్రొద్దున్నగాని బైలుదేరదట బస్సు అన్నారు. ఈమాట వినటంతోనే నాగుండె ఝల్లుమన్నది. నేను విడిమనిషినిగాను: ముగ్గురు పిల్లలు, రెండు సూటుకేసులు, పక్క చుట్ట, పండ్లు పూలూ వగైరా బుట్టలు రెండు, మరచెంబు, గాడిద బరువు సామాను. ఈ అధ్వాన్నపడవిలో, ఈ పిల్లలు సామాను ఏం చెయ్యాలో తోచలేదు. మగవాళ్లంతా యెటువాళ్లటు వెళ్లిపోతున్నారు. ఒక బ్రాహ్మణ వితంతువు, ఇంకా కొంతమంది బ్రాహ్మణేతర స్త్రీలు పురుషులు ఉన్నారు నాతోకూడా.

ఏమి చెయ్యటానికి తోచలేదు. ఇంతలో యేడ్పు మొదలుపెట్టాడు మా మోహనుడు. వాడికి పాలుపోసే వేళైంది. ఎంత సముదాయించినా ఊరుకోడు. ఆకల్లి అని ఏడ్పు మొదలుపెట్టాడు రాధాయి. శకుంతల కొంచం ఊహతెలిసినపిల్ల గనుక కొంచం మంచినీళ్లు అడిగి అల్లాగే నుంచున్నది బిక్కముఖంతో. ఈ అవస్థ అంతా, యెల్లాగా అని ఆలోచిస్తూ నుంచున్నాను. ఈ దృశ్యమంతాచూచి ఒక బ్రాహ్మణేతర యువకుడు మాదగ్గరకువచ్చి, 'యేమండీ అమ్మగారూ ఇక్కడికి చేరువలో ఒక ఊరు ఉన్నది. అక్కడికి తీసుకువెళ్లుతాను వస్తారా?' అన్నాడు. నాకు యేమి తోచలేదు. వస్తాను అంటే వీడు యెవడో అని భయం. వెళ్లకపోతే చెట్టుక్రింద పిల్లలతో యెల్లాగా ఉండేదీ అని సందేహం. ఇల్లా అనుకుని 'మీవాళ్లందరు ఉన్నారుగదా? వాళ్లు యెక్కడికి వెళ్లుతారు?' అన్నాను. 'మేమందరము ఆవూరే వెళ్లుతామండీ తమతోకూడా ఇంకొకళ్లు లేరని తెలుసుకొని మా ఆడోళ్లు చెపితే మిమ్ములనుకూడా ఆ ఊరు చేరద్దామని వచ్చాను. అదుగో మావాళ్లంతా వెళ్లబోతున్నారు. నేనుకూడా వెళ్లుతాను యేమంటారు?' అని

రోడ్డుకు అవతలవైపునున్న మఱ్ఱిచెట్టు వైపుకు తల విసరి వెళ్ళబోతున్నాడు ఆ యువకుడు. నాతోకూడా ఉన్న ముసలామె మటుకు నను వదలిపెట్టలేదు. అప్పుడు ఆమెఅన్నది 'పదమ్మా పట్టపగలుయేంభయం గనుక. వీళ్లుకూడా వెళ్లిపోతే ఒంటరిగా మనం యేం చెయ్యగలం' అని. 'సరే వస్తానబ్బీ' అన్నాను. ఆ యువకుడు వెనక్కుతిరిగి పెట్టెలు రెండూ నెత్తినపెట్టుకునీ పక్కచుట్ట చేతబట్టుకుని పండ్లబుట్టలు చంకకు తగిలించుకుని, 'రండమ్మా' అన్నాడు. నేను పసివాడిని చంకపెట్టుకుని రాధాయిని చేతోపట్టుకొని నడిపించుకుంటూ నడుస్తున్నా. మరచెంబు చేతపట్టుకుని వాడిపోయిన ముఖంతో మెడవేలవేసి నావెనుకాలె నడుస్తున్నది శకుంతల. 'అమ్మా నలవలేనే లాల్లు గిచ్చుతున్నాయేమో? వానునలుత్తాలు, నన్నెత్తుకోవే' అని పైటపట్టుకుని లాగుతూ నన్ను నడవనివ్వకుండా అడ్డగిస్తున్నాడు రాధాయి. ఇదంతా చూశాడు ఆయువకుడు మాకంటెముందు నాలుగుబారలదూరం నడచి తనవారి నెవ్వరినో కేకవేశాడు. అదివిని పదేండ్ల పిల్లవచ్చి 'యెందుకన్నా' అన్నది.

'పాపం! ఆపిల్లవాడు యేడుస్తున్నాడు యెత్తుకో' అన్నాడు ఆయువకుడు. ఆపిల్ల రాధాయి నెత్తుకున్నది. అప్పుడు మనసులో అనుకున్నాను. 'ఇది ఏనాటిబాకీ భగవంతుడా' అని. ఎల్లాగైతే యేం చేరాం ఆఊరు. ఊరుపేరు నాకురాదు. అది ఒక చిన్నఊరు. ఊరుబైట సత్రంలో దిగాము. ఎన్నడు చిమ్మి అలికి బాగుచేసిన సత్రంకాదది. ఏంచేస్తాం. అంతకంటే గతిలేదు. అక్కడే కూలపడ్డాం. ఆసత్రంలో డెబ్బైఏండ్ల ముసలామె, పదేండ్ల పిల్లవాడు ఉన్నారు. శూద్రాముల గుమ్మం కదిలితే అన్నమ్మాట చేతులోలేకుండా ఉండరు. అక్కడ దిగడమే తడవుగా అన్నాలు తినడం మొదలుపెట్టారు వాళ్లు.

అదిచూచి ఏడవడం మొదలుపెట్టాడు మా తెలిసీ తెలియని రాధ. ఏంచెయ్యను? వీళ్ల యేడుపులు యెక్కువౌతున్నాయి. ప్రొద్దు కూకుతుంది. ఎందుకు బైలుదేరాను అని విసుగొచ్చింది. అప్పుడు ఆసత్రపు అవ్వగార్ని అడక్కతప్పింది కాదు. 'అవ్వగారు మా అబ్బాయికి కొంచం అన్నం పెడతారా?' అన్నాను. 'ఈపూట నేను అన్నం తినను. మా అబ్బాయికి ,పాడిఅన్న మింత పెట్టాను. లేదమ్మా' అన్నది అవ్వ. ఇదంతా చూస్తూన్నాడు ఇందాకటి యువకుడు. చప్పున ఊళ్లోకివెళ్లి ఎక్కడన్న పూటకూలి పెడతారా? అని కనుక్కుంటె పెడతారుగాని రాత్రిళ్లు పెట్టరు అన్నారట. ఎల్లాగో వార్ని బ్రతిమాలి వారికే యేదో ఇస్తానని వారిచేతనే తీసుకొచ్చాడు, అన్నం. వాళ్లడిగిన డబ్బిచ్చేసి ఆఅన్నం తీసుకొని పిల్లలిద్దరికిపెట్టి వాళ్ల యేడుపు మాన్పేసరికి పసివాడు మొదలుపెట్టాడు యేడుపు. ఎవర్ని యేమడగటానికి తోచలేదు నాకు. ఇంతలో ఆయువకుడు వచ్చి మళ్లీఅడిగాడు 'యేమండీ అమ్మగారు! అబ్బాయిగారు ఏడుస్తున్నారు. బిస్కత్తులు కావాలా?' అని. 'బిస్కత్తులు వద్దు. ఎక్కడన్నా ఆవుపాలు దొరికితే తెచ్చిపెట్టు' అన్నాను. చెంబు తీసుకొని వెళ్లాడు మళ్లీ ఊళ్లోకి.

ఎక్కడో పాలుతెచ్చి ఆపుల్లా ఈపుల్లా యేరి అతనే కాచిఇచ్చాడు పాలు. ఇతని ఋణం యెల్లా తీర్చుకుంటానా అనుకున్నా మనసులో. ఆ పాలు పోశాక సొమ్మసిల్లినట్లు నిద్రపోయాడు మోహనుడు. ఇక నాదేమిటి తిన్నా తినకపోయినా బందీలేదు. ముసలమ్మ నన్ను విడవకుండానే ఉన్నది. పెద్దప్రాణం కొంగేసుకుని పడుకున్నది అరుగుమీద. అవ్వగారు రెండుపండ్లు పుచ్చుకుంటారా? అన్నాను. 'అబ్బే! ఈగుడ్డలతో తిననమ్మా' అన్నది అవ్వ. 'పండ్లకేం మడికావాలి? తినండి' అని నాలుగరటిపండ్లు ఒక బొత్తాయిపండు ఇచ్చాను అవ్వగార్కి.

# బస్సు ప్రయాణం

నేను ఒక బొత్తాయిపండు తిని కూర్చున్నా నాలుగువైపులా చూస్తూ. అమ్మగారు భయములేదు. నేను మేలుకునే ఉంటాను. మీరు పండుకోండి అన్నాడు ఆయువకుడు. అతనికి రెండు పండ్లు ఇవ్వపోయినా వద్దమ్మా ఇప్పుడే అన్నం తిన్నాను అన్నాడు. నేను ఆ పిల్లలపక్కనే పడుకున్నా. ధనమున్నవాడికి కార్యముచేయ తలచుకున్నవాడికిని నిద్రపట్టదంటారు పెద్దలు. అల్లాగే నాకు నిద్రపట్ట లేదు. నాదగ్గిర రెండువేలదాకా వస్తువులున్నాయి. ఎటునుంచి యెవడువచ్చి తలబద్దలు కొడతాడో అని భయం. కళ్లుమూస్తూ తెరుస్తూ తెల్లవార్చాయెల్లాగైతే యేం.

బుఱ్ఱుమంటూవచ్చి ఆగింది బస్సు. పరాభవంచేసినవాళ్లని మరియాదచెయ్యటానికి. జనం అంతా తృళ్లిపడిలేచారు. నాకు మటుక్కు వళ్లుమండింది దాని చూస్తే. ఏంచేస్తాను. అదేగతి. మళ్లీ ఆయువకుడువచ్చి 'పదండమ్మగారు' అన్నాడు. సరే లేచి వెళ్లి యెక్కాం పిల్లలు నేను. సామానుతెచ్చి టాపు మీద పెట్టాడు అతను.

ఒక్క అఱుపుఅఱచి రివ్వున తన ఆరంభశూరత్వం చూపిస్తూ రెండు దూకల్లో బెల్లంపూడి చేరింది. బ్రతుకు జీవుడా అని దిగాం పిల్లలూ నేను పులినోట్లోనుంచి తప్పించుకున్న మేకపిల్లలాగా. మా పెట్టెలు సామాను దింపి 'ఇక సెలవు ఇప్పిస్తారా అమ్మగారు?' అన్నాడు ఆయువకుడు.

వాడు చేసిన ఉపకారానికి యేమి ప్రతిఫలమో నాకు తోచలేదు. రెండు రూపాయలు తీసి ఇవ్వపోయాను. 'నాకెందు కమ్మగారు? వద్దు' అన్నాడు. చాలవు కాబోలు అనుకుని పెట్టెతీసి అయిదురూపాయల నోటుతీసి ఇవ్వపోయినా 'మీపిల్లల కేదైన కొనిపెట్టు' అని.

'నేను కూలికి చెయ్యలేదండీ. అమ్మా! తమరు వక్కరే ఇబ్బందిపడుతారు అని మా ఆడోళ్లు మా జేజమ్మా చెపితేను యేదో నాచేతనైన సాయంచేశాను. నాకేమి వద్దు. దయఉంచండి' అని వక్క నమస్కారంచేసి వెళ్లి తనసీట్లో కూర్చున్నాడు. బుఱ్ఱున వెళ్లింది బస్సు. మనం డబ్బిచ్చి ఇంట్లో అట్టేపెట్టుకున్న నౌకర్లుకూడా ఇంత వినయవిధేయతలతో పని చేయరు. వీడు యెవడు మనకు ఇంత కష్టంచేసి ఏమి పుచ్చుకోకుండా వెళ్లాడు అని నాలో నేను అనుకుంటూనుంచున్నా. ఇంతలో మా రాధయేడ్పు మొదలుపెట్టాడు. యెందుకురా అని అడిగితే మళ్లీ మనను ఒదిలిపెట్టి బస్సువెళ్లింది అని వాడి ఏడుపు. మనఊరు వచ్చింది నాయినా అని వాణ్ణి సముదాయించి ఊరివంక చూస్తూ రోడ్డుప్రక్క పిల్లలను పెట్టుకొని నుంచున్నా.

౨

మా మేనత్తభర్త బెల్లంపూడి కరణం. అందువల్ల చుట్టుపక్కాల మూటలు పెట్టెలు వగైరా సామానులు గ్రామనౌకర్లు మోస్తారు. నేను చూస్తూఉండగానే మెహతాదువచ్చి 'కరణంగారు పంపారు. వారిచుట్టాలెవరన్నా ఉన్నారా' అన్నాడు. మా మామయ్య చాలా మరియాదస్థుడు. తమ ఇంట్లో పెండ్లికి ఎటునుంచి ఎవరు వస్తారో చుట్టాలు ఇబ్బంది పడతారని వచ్చే పొయ్యే కార్లదగ్గిరకి నౌకర్లను పంపుతున్నారుట మెహతాదు చెప్పాడు. మేము కరణంగారి చుట్టాలమేనని సామాను వాడి నెత్తిన పెట్టి మేము వెనకాలే చేరుకున్నాం యింటికి.

---

ఈ రచయిత్రిగారు ఆయా సందర్భాలను పూసగుచ్చినట్లు వివరిస్తారు. వారు వ్రాసిన సంఘటనలను చదువుతూవుంటే వాటికి అతిశయ దోషంగాని వివరణ లోపంగాని వున్నట్టు కనపడదు. దానికి వారిని అభినందిస్తున్నాం. ఇలాంటి రచనాశక్తి చాలామందికి వుంటుంది. వారంతా దానికి రూపిచ్చి తమ సోదరి గృహలక్ష్మికి కానుకలుగా సమర్పిస్తారని ప్రార్థిస్తున్నాం.

---

మా అత్తయ్య యెదురుగావచ్చి యెప్పుడు రాక రాక వచ్చావని సంతోషపడ్డది. నా ప్రయాణపు కష్టమంతా చెప్పేసరికి ఇంత కష్టపడి వచ్చావని కొంచంసేపు అనుకున్నది. మా అక్కయ్య మా ఒదినా నిన్ననే వచ్చారట. ఇక నేను మా మేనత్తకూతుళ్లు మేం అందరం పెండ్లిహడావుడిలో దిగాం.

రాత్రికే పెండ్లి. మూడుగంటల బస్సుకు పెండ్లివారు వస్తారు. వరపూజచేసి తీసుకురావాలి అని మేమంతా ముస్తాబులై సిద్ధంగావున్నాం. మా మామయ్య అంతకంటే హడావుడిగా ఉన్నాడు: ఇంట్లో వాళ్లను కేకలెయ్యడం, వాకిట్లో వాళ్లను తిట్టడం. ధోవతి పైకికట్టి తలగుడ్డచుట్టి ఇట్లోకి బైటికి తిరుగుతున్నాడు. నాలుగైంది. పెండ్లివారు రాలేదు. కార్లరాక కెదురుచూస్తున్నాం. ఇంతలో ఒక సోమయాజులగారు వచ్చారు యజ్ఞశాలువ కప్పుకొని, ఝూరీచెంబులంత కుండలాలు చెవులకు తగిలించుకొని. ఆయన పౌరోహితుడట. పెండ్లివారు పంపారన్నాడు. కారణం యేమని అడిగితే 'పెండ్లివారు రెండు మైళ్ల దూరంలో ఉన్నారు. వర్షంవల్ల బస్సులు ఇక్కడి వరకు రావన్నారు. అక్కడదించేసి బస్సులు వెళ్లిపోయినాయి. మిమ్మలను బండ్లు సప్లైచెయ్యమన్నారు పెండ్లివారు' అన్నాడు గంభీరంగా ఆయాసపడుతూ సోమయాజులు.

ఆఊరు పల్లెటూరు. గుఱ్ఱపుబండ్లు ఒంటెద్దుబండ్లు ఉండవు. కరణం గనుక కొన్ని దున్నపోతులబండ్లు కొన్ని రెండెడ్లబండ్లు పోగుచేసి చింకికంబళ్లు చిరిగిపోయిన ఈతాకుల చాపలు కొన్నింటికిమాత్రమె గూళ్లు కట్టించి సుమారు పదోపన్నెండో ఉంటాయి పంపారు బండ్లు. ఆబండ్లమీద వచ్చారు పెండ్లివారు. బాజాలవాళ్లు ముందేవచ్చారు. బాజాలు వాయించుమనే వరపూజ కెళ్లాం. మేమందరం వక్కచోట నుంచున్నాం. ఇంకా మా మామయ్య కనిపించలేదు.

ఇంతలో పదహారేండ్లపిల్ల మాదగ్గరకొచ్చి వియ్యపురాలు ఆడపడుచులు రాలేదండీ అన్నది మెడ త్రిప్పుతూ గరువంగా. ఆమెకంటే ముందే లోలకులు ఊగుతున్నాయి. ఆమాట వినేసరికి నాకు వళ్లు మండింది. మగపెండ్లివారితో వచ్చిన కుక్కకుకూడా మేష్ట్రిటుపవరుంటుందిట. అల్లాగే ఆఅమ్మాయి మెడత్రిప్పడం అతిశయంచూస్తే నాకు నవ్వొచ్చింది. ఆమాట విని మావాళ్లంతా తెల్లపోయారు. 'ఎందువల్ల' అన్నాను నేను. 'ఈ బండ్లు వాళ్ల కలవాటు లేదండీ మేనాలు పంపితే వస్తారు' అన్నది ఆ అమ్మాయి. 'మేనాలు అలవాటు ఉన్నాయా' అన్నాను నేను.

ఇంతలో మా అత్తయ్య కన్ను కదిపింది వారికి కోపమొస్తుందేమో అన్నట్లుగా. మా మామయ్య 'వచ్చినుంచున్నారేం?' అని కసిరారు. 'నుంచోక యేం చెయ్యమన్నారు? ముఖ్యమైనవారు వియ్యపురాలు ఆడపడుచులు రాలేదట' అన్నది మా అత్తయ్య. నిరుత్సాహంగా 'అయితే ఇప్పుడు నన్నేం చెయ్యమన్నావు?' అన్నారుమామామయ్య. 'మేనాలు పంపితే వస్తారట' అన్నది మా అత్తయ్య. 'ఆసంగతి ఇందాకనే తెలిస్తే బండ్లతోపాటు పంపేవాళ్లం కదా' అని అనుకుంటూ వెళ్లారు మా మామయ్య.

మేంకూడా ఇంటి కెళ్లిపోయినాం. చేతిక్రింద నౌకర్లు గనుక కేకవెయ్యగానే రెండు మేనాలు భుజాన వేసుకొని వెళ్లి తీసుకొచ్చారు వియ్యాలవార్ని. యెనిమిదైంది వాళ్లు వచ్చేసరికి. తొమ్మిదింటికల్లా లగ్నం అయింది. ఇక అయిదు రోజుల వాళ్లు పెట్టిన తిప్పలు ఇన్నీ అన్నీ కాదు. ఇవన్నీ చూస్తూంటే మా తాతయ్యను ఈయన పెట్టిన తిప్పలు నాకు జ్ఞాపకంవచ్చాయి. అంతే కావాలనుకున్నాను మా మామయ్యను. పిల్లతో నన్నూ మా మేనత్త కూతురు సుశీలను వెళ్లమన్నారు. బస్సు అని పేరు చెపితేనే భయంగావుంది నాకు. బస్సుమీద వెళ్లడం

అదిగాక ఇంటిదగ్గిర చెప్పకుండా వెళ్లడానికి నా కిష్టంలేకపోయింది. ఎల్లాగైతేయేం తప్పించుకున్నా ఆప్రయాణం.

ఇక మాఊరు వెళ్లాలిగదా 'బస్సువద్దు బండి కుదుర్చ'మన్నా మామయ్యను. 'బండిప్రయాణం ఆలశ్యం అవుతుంది. బస్సైతే రెండు గంటల్లో వెళ్లుతారు. నీకు భయమైతే పెదబావను పంపుతా'నన్నారు మా మామయ్య. మా అత్తయ్య అలాగే అన్నది. అందరిమాట తోసెయ్యడం యెల్లాగా అని 'సరే' అన్నాను. రాకరాక వచ్చావని ఇంకా ఉండమని మా అత్తయ్య గునుస్తూనే ఉన్నదిగాని నాకు ఉండ బుద్ధి కాలేదు. పెండ్లివారు వెళ్లిన మర్నాడు ప్రొద్దున్న పది గంటలకు భోజనాలుచేసి బైద్దేరాం బస్సుకు. వెళ్లుతున్నానేగాని బస్సు అంటే భయం కోపంకూడా వస్తున్నాయి. ఏంచెయ్యను. బస్సు ప్రయాణం తప్పిందికాదు. రోడ్డుమీదికి వెళ్లి కూర్చున్నాం చెట్లక్రింద పదింటికి. పదకుండైంది, పన్నెండైంది. బస్సులేదు. ఆపళంగా మళ్లీ ఇంటికెళ్లాం. నాకు నవ్వాగలేదు. పక్కన నవ్వాను మా అత్తయ్యను చూచి. 'ఏమిటే మళ్లీ తిరిగివచ్చారు?' అన్నది మాఅత్త. 'నాకేమి తెలియదు. బావ నడుగు' అన్నాను.

'ఏమిరా అబ్బాయి మళ్లీ వచ్చారు?' అన్నది కొడుకుని చూసి. 'ఇవ్వాళ్ల బస్సు రాలేదు' అన్నాడు మాబావ. 'సత్యవతి భయపడుతున్నట్లుగానే ప్రయాణానికి ఇన్ని వడుదుడుకులేరా' అన్నది మా అత్తయ్య కొంచం విచారసూచకంగా. 'అమ్మా ఇదంతా బస్సు లోపంకాదు. నీ మేనకోడలి ప్రయాణమహిమ. రాకరాక వచ్చింది గనుక ప్రయాణం జ్ఞాపకార్థంగా ఇల్లా జరుగుతున్నాయి గాని యెప్పుడన్నా బస్సుల కిల్లాంటి ఆటంకాలు జరిగాయా? మొన్న పెండ్లివారికి జరిగిన బస్సుల ఇబ్బంది కూడా నీ మేనకోడలి ప్రయాణపుశాఖే. లేకపోతే యెప్పుడన్నా ఆ పాలకొల్లు రోడ్డున బస్సులు ఆగిపోవడం ఉందా?' అని మాబావ విరగబడి నవ్వాడు. నాకు నవ్వొచ్చింది. మా అత్తయ్య నవ్వింది. అంతా నవ్వాం. 'అమ్మా ఇక సత్యప్రయాణవిషయం మీరు చూచుకోండి. నాకు సెలవైపోయింది. నేను చెన్నపట్నం వెళ్లాలి' అన్నాడు మాబావ. "మీ ప్రయాణం సంగతి తరువాత చూచుకోవచ్చు. అసలె అది భయపడుతున్నది. వంటరిగా యెల్లా వెళ్లుతుంది? మీ నాన్నగారికి తీరుబాటులేదాయె. నాలుగుగంటల బస్సుకు దాన్ని తీసుకెళ్లు' అన్నది మా అత్తయ్య. 'ఒంటరిగా వెళ్లలేక నాకేం భయం. చెన్నపట్నంలో ఉన్నప్పుడు పిల్లలు నేను రావడం పోవడం అలవాటే నాకు. బస్సు భయమేగాని ఒంటరి భయంలేదు' అన్నాను. 'సరే బైద్దేరమను' అన్నాడు మాబావ. మళ్లీ పిల్లలకు రెండోమాటు అన్నాలుపెట్టి వెళ్లాం నాలుగ్గంటల బస్సుకు.

మేము వెళ్లిన కొంచంసేపటికల్లా బుఱ్ఱునవచ్చి ఆగింది బస్సు. 'అమ్మా బస్సువద్దే బండి యెక్కుదామే' అని వెనకాల నసపెడుతున్నది మా శకుంతల. 'ఇవ్వాళ అల్లాంటి బస్సుకాదమ్మా. చప్పున వెళ్లుతుంది ఈబస్సు' అని దాన్ని సమాధానపరచి యెక్కాం బస్సులో. వాయువేగాన్ని మరపించేటట్లు వెళుతున్నది బస్సు. మొన్న మేం దిగిన సత్రం చూపించా మాబావకు. పెనుగొండలాకులు వచ్చాయి. అక్కడ ఆగింది బస్సులాకుదగ్గిర. ఆగడం మామూలే గనుక భయంలేకుండానే కూర్చున్నా. ఎంతసేపటికి కదలడం అంటూ కనిపించలేదు. ప్రొద్దుకూకుతున్నది. మొన్నటివేళ జ్ఞాపకంవస్తూంది. 'ఎందుకు ఇంతసేపు ఆగింది' అంటే 'లాకుగుమాస్తాగారి తమ్ముడిబావమరది తణుకు సినిమాకు వస్తాడట. ఆయన తలంటిపోసుకొని భోజనం చేస్తున్నాడట' అన్నారు. నాకు యెక్కడలేని కోపంవచ్చింది. 'రెండెడ్లబండిలాగ ఆగ

మంటే ఆగడం, పొమ్మంటే పోవడం ఏమిటి?' అని మాబావ నడిగాను. 'వాళ్లకు వాళ్లకు మొఖమోటా లుంటాయి' అన్నాడు మాబావ. సరే బైలుదేరింది బస్సు. తణుకు ఇంకా రెండు మైళ్లుంటుంది. టప్పుమని ఆగింది బస్సు. నాగుండె ఝల్లుమన్నది. మళ్లీ యేదో వచ్చిందిరా భగవంతుడా అనుకున్నా. మా బావ అడిగాడు ఆగిన కారణం. 'పెట్రోలు అయి పోయింది సార్. యిప్పుడే వస్తామని వెళ్లాడు' అన్నాడు డ్రైవరు. అతను మాబావ కొంచంసేపు ఇంగ్లీషుతో పోట్లాడుకున్నారు. తరువాత నన్ను చూచి మా బావన్నాడు 'ఒదినా నీకు బస్సుప్రయాణం అచ్చిరాదుగాని యెప్పుడు బస్సులో బైల్దేర వద్దు. నీమూలంగా పాసింజర్సు అంతా ఇబ్బంది పడుతారు' అని. నాకు కొంచం కోపంవచ్చింది 'వెధవ బస్సులు ఇప్పుడొచ్చాయిగాని గుఱ్ఱబ్బండ్లు ఒంటెద్దుబండ్లు రైళ్లప్రయాణానికి పోయిగాని యేం ప్రయాణం వెధవ బస్సుప్రయాణం? మా ఇంటిదగ్గిర ఒంటెద్దుబండివాడు ఏడుస్తూన్నాడు బస్సులొచ్చిం తరువాత పొట్టజరగటంలేదని. బండ్లవాడ్ల కడుపు కొట్టటానికి వచ్చిన బస్సులేగాని ప్రయాణసౌకర్యానికి వచ్చిన బస్సులు కాదు' అన్నాను వళ్లుమండి.

ఇంతలో సైకలేసుకొని మాకు యెదురొచ్చాడు ఒకాయన. మాబావకు మావారికికూడా స్నేహితుడే నట. ఆయన అడిగాడు బస్సాగిన కారణం. అంతా చెప్పాడు మాబావ. అప్పటికి యేడుగంటలైంది. పసివాడు భుజాన నిద్రపోయాడు. రాధాయి కాలిమీద పడుకుని నిద్రపోయాడు. శకుంతలముటుకు సీటుకు చేరబడి కండ్లుమూస్తూ తెరుస్తూ కూర్చున్నది. ఈ అవస్తంతా చూశాడు వచ్చినాయన. చప్పున తనసైకలు వెనక్కు త్రిప్పుకుని తణుకువెళ్లి ఒక గుఱ్ఱబ్బండి పంపాడు. ఆబండియెక్కి పావుగంటకలో చేరాం మాఇంటికి. అదివరకే మాపంతులుగారు మేనత్తను తీసుకొచ్చారు కాబోలు వంటచేస్తున్నది ఆవిడ. మమ్ములనుచూచి ఇంకా కావలసినవిచేసి అందరికీ వడ్డించింది. మాబావా మాపంతులుగారు భోజనాలయాక చాలాసేపు మాట్లాడారు. మాబావను ఉండమని యెంతబ్రతిమాలినా ఉండకుండా తెల్లవారి యేడుగంటల బస్సుకే వెళ్లాడు. ఈ అవస్తంతా చెపితే యేంకోప్పడుతారోనని నేను చెప్పలేదు. పిల్లలు చెప్పలేదు. తరువాత తెలిసిందిలెండి. రోజులు గడచినాయి గనుక నవ్వి ఊరుకున్నారు. కాని, ఇన్ని వత్సరాలు గడచినా ఆ బస్సుప్రయాణం తలుచుకుంటే నాగుండె ఝల్లుమంటుంది.

# ప్రబోధము

తే. చదువుసంధ్యల సమయము చాలులెండు, రండు తడవేల యెల్లకార్యములువిడిచి
మాతృసేవకు తరుణంబు మఱలరాదు, ధైర్యనిధులార ! ఆంధ్ర విద్యార్థులార !

శా. ఆలోచించెదరేల ? యాంధ్రవరులాహా ధర్మసంరంభము
ద్వేలంబై జగమెల్ల నల్లుకొనెడున్ ధీరాత్ములై లెండు లెం
డేలోటుండదు దానికిన్ మనము రాలేదన్న మాటుండు నే
డేలా యీయపనింద ? వేగపడిరండీ ! తల్లి సేవింపఁగన్.

తే. ఎంతకాలంబు నిద్రింతు రింకమీరు, మేలుకొను దుద్యమంబునఁ బాలుగొనుఁడు
పాలుకొని మేలుకొని రాజ్యమేలుకొనుఁడు, ఆర్యరత్నమ్ములార యో యాంధ్రులార !

వీరపనేని సరోజనీదేవి.